సాక్షి
నిర్మల్

ఆదివారం ၊ 31 ၊ మార్చి ၊ 2024



పునరావాసం ఎప్పుడో..?

గుండేగాం పునరావాసంపై స్పష్టత రావడం లేదు. ఏళ్ల సమస్యకు ఎక్కడ పరిష్కారం కనిపించడం లేదు. ప్రభుత్వం మారినా గుండేగాం సమస్య మాత్రం తీరడం లేదు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది : 6:31	సోమ : 4:48

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.7 /27.7

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు ఉదయం నుంచే పెరుగుతాయి. మధ్యాహ్నం తర్వాత వేడి తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోత కూడా ఎక్కువగా ఉంటుంది.

సర్కార్ జాగాలో పాగా!



ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

- విలువైన భూములు దర్జాగా కబ్జా..
- ఎఫ్ఎస్‌సీఎస్ భూమికే ఎసరు
- జిల్లా కేంద్రంలోనే ఆక్రమణల 'రాజకీయం'
- ఫిర్యాదుతో కూల్చేసిన మున్సిపల్ సిబ్బంది

నిర్మల్/నిర్మల్‌టౌన్: జిల్లాలో ప్రభుత్వ స్థలాలను సైతం దర్జాగా కబ్జా చేస్తున్న తీరు చూసి ప్రజలు విస్తుపోతున్నారు. ఇప్పటిదాకా చెరువులు, బురుజులు, కందకాలను ఆక్రమించిన కబ్జారాయుళ్లు.. ఇప్పుడు జిల్లా కేంద్రంలోనే ఎఫ్ఎస్‌సీఎస్(ఫార్మర్ సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీ)కి చెందిన రూ.లక్షలు విలువ చేసే స్థలాన్ని ఓ పార్టీ నాయకుడు కబ్జా చేశాడు. చివరకు సొసైటీయే ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా ఈ ఒక్కటే కాదు.. చాలా స్థలాలను కబ్జా పెట్టి, రూ.లక్షలకు అమ్మేసుకుంటున్నారు. విషయం తెలియని అమాయకులు కొనుగోలు చేస్తూ ఇబ్బందుల పాలవుతున్నారు.

సర్కారు జాగాలో..

జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో జాతీయ రహదారికి అతి సమీపంలోనే ఎఫ్ఎస్‌సీఎస్ భూమి ఉంది. ఎకరానికిపైగా ఉన్న ఈ భూమిపై చాలామంది కన్నేశారు. గతంలోనే ఇందులో ఆక్రమణలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా ఓ పార్టీకి చెందిన మండల నాయకుడు ఈ స్థలాన్ని ఆక్రమించి షెడ్డు నిర్మించాడు. మాజీ ప్రజాప్రతినిధి, సీనియర్ నేత పేరు చెప్పి ఈ నాయకుడు కబ్జాకు పాల్పడ్డట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో కొన్నేళ్లుగా ఇలా రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధుల కబ్జాలు పెరుగుతూ వస్తున్నాయి.

తొలగించిన మున్సిపాలిటీ..

ఎఫ్ఎస్‌సీఎస్ ఫిర్యాదు మేరకు మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు, టీపీవో సుమలత, సిబ్బంది శనివారం కబ్జా చేసిన స్థలంలో నిర్మాణాలు తొలగించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇలాంటి ఆక్రమణలపై చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. మిగతా ఆక్రమణలపైనా చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

సొసైటీ ఫిర్యాదుతో..

జిల్లా కేంద్రంలో చిన్నసైజు ప్లాటు కూడా రూ.లక్షల్లో ధర పలుకుతున్నాయి. పట్టణం శివారులోనూ ఒక్కో ప్లాటు రూ.30 లక్షలకు పైగానే ఉంది. ఈక్రమంలో ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కందకాలు, చారిత్రక బురుజులను టార్గెట్ చేసి, క్రమంగా ఆక్రమించేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలపై పెద్దగా పట్టింపు లేకపోవడం, అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధుల పేరిట అధికారులను భయపెట్టడం, లేదంటే మామూళ్లు ఇవ్వడంతో ఈ తతంగమంతా నడుస్తోంది. ఇదే క్రమంలో విలువైన ఎఫ్ఎస్‌సీఎస్ భూమినీ కబ్జా పెట్టారు. చివరకు సొసైటీయే మున్సిపాలిటీకి ఫిర్యాదు చేయాల్సి వచ్చింది.

ముగిసిన 'పది' పరీక్షలు



- ఏప్రిల్ 3 నుంచి మూల్యాంకనం
- జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ స్కూల్‌లో ఏర్పాట్లు
- జిల్లాకు చేరుకుంటున్న జవాబు పత్రాలు
- స్పాట్‌లో పాల్గొననున్న 575 మంది సిబ్బంది

నిర్మల్ రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ముగిశాయి. ఒకేషనల్ కోర్సుల పరీక్షలు ఏప్రిల్ 2న ముగుస్తాయి. ఈనెల 18 నుంచి 30 తేదీ వరకు జిల్లాలో 47 పరీక్ష కేంద్రాలలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు ముగియడంతో ఫలితాలు సకాలంలో విడుదల చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో స్పాట్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే జవాబు పత్రాలు జిల్లా కేంద్రానికి చేరుకుంటున్నాయి. వీటిని అత్యంత భద్రత నడుమ పర్యవేక్షిస్తున్నారు. ఏప్రిల్ 3న మూల్యాంకనం ప్రారంభమై 12 వరకు కొనసాగనుంది.

గతంలో ఆదిలాబాద్‌లో..

పదో తరగతి స్పాట్ కేంద్రం జిల్లా ఏర్పడక ముందు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించేవారు. దీంతో అక్కడికి వెళ్లి స్పాట్‌లో పాల్గొనాలంటే ఉపాధ్యాయులు ఇబ్బంది పడేవారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించారు. ఒకసారి సప్లిమెంటరీని విజయవంతంగా చేపట్టిన విషయాన్ని తెలియజేశారు. దీంతో అప్పటి సర్కారు జిల్లా కేంద్రంలో స్పాట్ కేంద్రాన్ని 2002లో మంజూరు చేసింది. మూడోసారి జిల్లాలో ఉపాధ్యాయులు జవాబు పత్రాలను దిద్దనున్నారు. 2022 సంవత్సరంలో 70 వేల జవాబు పత్రాలు రాగా, 2023లో 80 వేల జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. రెండు సార్లు కూడా విజయవంతంగా వాల్యుయేషన్ చేయడంతో మూడోసారి కూడా ప్రభుత్వం కల్పించింది. ఈసారి వివిధ జిల్లాల నుంచి సుమారు 1.40 లక్షల జవాబు పత్రాలు జిల్లాకు వస్తాయని అధికారులు తెలిపారు.

చివరి రోజు 24 మంది గైర్హాజరు..

ఇదిలా ఉండగా 12 రోజులపాటు జరిగిన పది పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు మొత్తం 8,923 మంది విద్యార్థులకు 8,899 మంది హాజరయ్యారు. 24 మంది గైర్హాజరయ్యారు. 4,322 మంది బాలురకు 4,309 మంది హాజరవగా 13 మంది గైర్హాజరయ్యారు. 4,601 మంది బాలికలకు 4,590 మంది హాజరవగా 11 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని టాటా.. బాయ్ బాయ్.. చెప్పుకున్నారు .

575 మంది సిబ్బంది కేటాయింపు..

వచ్చేనెల 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి స్పాట్ కోసం జిల్లాలో విద్యాశాఖ 575 మంది సిబ్బందిని కేటాయించింది. క్యాంప్ ఆఫీసర్‌గా డీఈవో ఉండగా, సహాయ క్యాంప్ ఆఫీసర్లు- 02, స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జి -01, స్పాట్ పర్యవేక్షకుడు -01, కోడింగ్ అధికారి-01, సహాయ కోడింగ్ ఆఫీసర్లు- 07, కోడింగ్ సహాయకులు- 30, సహాయ మూల్యాంకన అధికారులు- 394, ముఖ్య మూల్యాంకన అధికారులు- 65, ప్రత్యేక సహాయకులు- 67, మూల్యాంకన పర్యవేక్షకులు(సబ్జెక్టుల వారీగా)-07 మందిని కేటాయించారు. వీరందరికీ ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

స్పాట్ పకడ్బందీగా నిర్వహిస్తాం



వచ్చే నెల 3 నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి స్పాట్‌ను పకడ్బందీగా నిర్వహిస్తాం. 12 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటాం. జిల్లాలో 575 మందిని గుర్తించి వారికి శిక్షణ కూడా పూర్తి చేశాం. జిల్లాకు కేటాయించిన 1.40 లక్షల జవాబు పత్రాలను సకాలంలో మూల్యాంకనం చేసేలా చర్యలు తీసుకుంటాం. – రవీందర్‌రెడ్డి, డీఈవో

ఉద్యోగ విరమణలు షురూ..!

- రిటైర్మెంట్ వయసు 61 ఏళ్లకు పెంచిన గత ప్రభుత్వం
- మూడేళ్ల తరువాత మొదలైన రిటైర్మెంట్లు



రిటైర్ అయినవారిని సన్మానిస్తున్న కలెక్టర్

భైంసాటౌన్: ప్రభుత్వ ఉద్యోగుల విరమణలు మళ్లీ మొదలయ్యాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 61 ఏళ్లకు పెంచుతూ 2021 మార్చిలో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మూడేళ్లు రిటైర్మెంట్లు ఆగిపోయాయి. 2023 మార్చి ముగియడంతో రిటైర్మెంట్లు మొదలయ్యాయి. 2021లో ఉద్యోగ విరమణ చేయాల్సిన వారు ఇప్పుడు రిటైర్ అవుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖలతోపాటు గ్రాంట్ ఇన్ ఎయిడ్ సంస్థలు, సొసైటీలు, కార్పొరేషన్లు, ఇతర సంస్థల్లో మార్చి 30 నుంచి ఉద్యోగ విరమణలు ప్రారంభమయ్యాయి.

ఉద్యోగ విరమణ పొందినవారికి సన్మానం..

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ఖజానాశాఖ అధికారి పి.ప్రభాకర్‌రావు, కలెక్టరేట్ పర్యవేక్షకులు పరిమల్ భౌమిక్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఇద్దరినీ సత్కరించారు. విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన పలువురి మన్ననలు పొందిన అధికారులు ఆదర్శప్రాయులన్నారు. అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందించిన ప్రభాకర్‌రావు, పరిమల్ భౌమిక్ అందరికీ ఆదర్శ ప్రాయులని పేర్కొన్నారు. డీటీవో ప్రభాకర్‌రావు మాట్లాడుతూ నిర్మల్ జిల్లాతో తనకు ఎంతో అనుబంధం ఉందని తెలిపారు. తనకు సహకరించిన సిబ్బందికి, కలెక్టర్‌కు, వివిధ శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పరిమల్ భౌమిక్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పని చేసినందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. తనకు సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, ట్రెజరీ సిబ్బంది పాల్గొన్నారు.

పనితనంతోనే ఉద్యోగికి గుర్తింపు



ఉద్యోగులతో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి

నిర్మల్‌టౌన్: పనితనంతోనే ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని ఆర్టీసీ నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అన్నారు. పలువురు ఉద్యోగులు శనివారం రిటైర్ కావడంతో డిపో ఆవరణలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కంట్రోలర్ శంకర్, డీఎం ఆఫీస్ ఉద్యోగి లక్ష్మీ ఉద్యోగ విరమణ పొందారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సంతోష్, అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, రిటైర్డ్ డిప్యూటీ ఆర్ఎం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఓటింగ్ పెంచాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు



కంట్రోల్ రూమ్ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల విధులు నిర్వహించే ప్రతీ ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోస్టల్ ఓటింగ్, హోమ్ ఓటింగ్ శాతం పెంచాలని ఆదేశించారు. సీవిజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. సువిధ ద్వారా అనుమతులు జాప్యం లేకుండా చూడాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులందరికీ శిక్షణ పూర్తి చేయాలని తెలిపారు. 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తూ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఫారాలను పరిష్కరించాలని ఆదేశించారు. అడిషనల్ సీఈవోలు సర్ఫరాజ్‌అహ్మద్, లోకేష్‌కుమార్ పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది రాండమైజేషన్ తదితర అంశాలను వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఆర్వో భుజంగరావు, ఏఆర్వోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, ఈడీఎం నదీమ్, అధికారులు పాల్గొన్నారు.

స్వీప్ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలి..

వందశాతం పోలింగ్ నమోదయ్యేలా స్వీప్ కార్యక్రమాలు విస్తృతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వీప్ కోర్‌కమిటీ సమావేశం నిర్వహించారు. గత ఎన్నికల్లో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో తగ్గిన పోలింగ్ శాతాన్ని గుర్తించాలన్నారు. మహిళా సంఘాలు, సీనియర్ సిటిజన్స్, ఎన్జీవోల ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని తెలిపారు. పట్టణంలోని ముఖ్య కూడళ్లు, పారిశ్రామిక వాడల్లో కళాజాత బృందాలతో ప్రచారం చేయాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటరు జాబితా ప్రదర్శించాలన్నారు. సమావేశంలో స్వీప్ నోడల్ అధికారి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీఆర్వో విష్ణువర్ధన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

విధులు సమర్థవంతంగా నిర్వహించాలి..

ఎన్నికల నోడల్ అధికారులు, తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నోడల్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు వివిధ అనుమతుల కోసం దరఖాస్తులు సువిధ యాప్‌లో 48 గంటల ముందు సమర్పించేలా అవగాహన కల్పించాలన్నారు. అనుమతుల జారీకి సింగిల్ విండో కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. ఈవీఎంల రవాణాకు 5 డీజీటీ వాహనాలు సిద్ధం చేయాలని, సెగ్మెంట్ల పరిధిలో స్ట్రాంగ్ రూంలు సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల కోసం ఉపయోగించే వాహనాలకు జీపీఎస్ పరికరాలు అమర్చాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, నోడల్ అధికారులు విజయలక్ష్మి, గోవింద్, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, సందీప్, విష్ణువర్ధన్, జి.రాములు, అధికారులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, కంట్రోల్ రూంను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కంట్రోల్ రూంలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్‌ల పనితీరును సీసీ కెమెరాల ద్వారా పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఆర్వో విష్ణువర్ధన్, డీపీవో శ్రీనివాస్, ఈడీఎం నదీం పాల్గొన్నారు.

సాహిత్యం.. నైతిక విలువలకు దోహదం

- డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: సాహిత్యం, కథలు విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందిస్తాయని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఏ.రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో వెల్మల్ బొప్పారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు రచించిన 'కథల సంపుటి'ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభ పాటవాలను బయటకు తీయడం ఉపాధ్యాయులతోనే సాధ్యపడుతుందన్నారు. కథల సంపుటి రచించిన పదో తరగతి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు తమ అంతర్గత ఆలోచనల ద్వారా రచనలను బయటకు తీయడం సాహితీ విలువల్ని పెంపొందిస్తుందన్నారు. విద్యార్థులు రాసిన కథలు హృదయానికి హత్తుకునే విధంగా సహజ సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కథలలో అత్యుత్తమ సామాజిక, కుటుంబ అంశాలను ఇతివృత్తంగా తీసుకోవడం గొప్ప విషయమని ప్రశంసించారు. విద్యార్థుల్లో కథలు రచించిన ప్రోత్సాహం అందించిన తెలుగు ఉపాధ్యాయుడు, కవి కొండూరు పోతన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాలం విద్యాసాగర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయి రెడ్డి, లక్ష్మణ్, ముత్తన్న, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కథలసంపుటి ఆవిష్కరిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి తదితరులు

న్యూస్‌రీల్

అటవీ సిబ్బందికి వైద్య పరీక్షలు



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కడెం: మండల కేంద్రంలోని అటవీ రేంజ్ కార్యాలయంలో శనివారం అటవీశాఖ అధికారులు, సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు ఎఫ్ఆర్వో చోలే అనిత తెలిపారు. రక్త పరీక్షలు, బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. అటవీ అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకుండా ముందస్తుగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు. ఇందులో డీఆర్వోలు ప్రకాశ్, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

సదరం షెడ్యూల్ ఖరారు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సంబంధించి దివ్యాంగ ధ్రువీకరణ కోసం ఏప్రిల్ నెలకు సంబంధించి క్యాంపుల తేదీలను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి ప్రకటించారు. 19న ఆర్థో, అంగవైకల్యం సీపీఏ, 16న వినికిడి, 24న మానసిక వికలాంగుల, 30న కంటి సంబంధిత శిబిరాలు ఉంటాయని వివరించారు. అర్హులైన వారు తమ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడి నుంచి అవుట్ పేషెంట్ స్లిప్ ద్వారా దివ్యాంగ కేటగిరీ నిర్ధారించుకుని దానిప్రకారం మీ సేవలో ఈనెల 1వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మీసేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకున్న వారు మాత్రమే సదరం క్యాంపులకు ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో హాజరు కావాలని సూచించారు.

గురుస్వామికి ఉత్తమ పురస్కారం

నిర్మల్‌టౌన్: తెలంగాణ శ్రీఅయ్యప్పస్వామి సేవార్థి ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రదానం చేస్తున్న ఉత్తమ గురువు పురస్కారానికి నిర్మల్‌కు చెందిన చెనిగారపు చిన్నయ్య ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించే కార్యక్రమంలో శ్రీపుష్పగిరి పీఠాధిపతులు శంకరాచార్య, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పురస్కారం ప్రదానం చేస్తారు.

అంగన్‌వాడీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న విలాస్

సోన్: అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టులు త్వరగా భర్తీ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ డిమాండ్ చేశారు. మండలంలోని సంగంపేటలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల అసోసియేషన్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పనిచేయడం లేదన్నారు. రిజిస్టర్లను కేంద్రాలకు పంపిణీ చేయాలని సూచించారు. అంగన్‌వాడీలకు తక్కువ జీతం ఇస్తూ ప్రభుత్వాలు ఎక్కువ పని చేయించుకుంటున్నాయన్నారు. 21 రోజుల సమ్మె అంగన్‌వాడీల ఐక్యతను చాటిందని తెలిపారు. వేసవి సెలవులు 30 రోజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మకుమారి, రాష్ట్ర సమితి సభ్యులు రాణి, దుర్గే, జిల్లా ప్రధాన కార్యదర్శి దయా సాగరి, సవిత, చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

జడ్జి కావడం గర్వకారణం



విశాల్ కులకర్ణిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

భైంసాటౌన్: పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది దిలీప్ కులకర్ణి కుమారుడు విశాల్ కులకర్ణి నల్లగొండ జిల్లా జడ్జి(స్పెషల్ జడ్జి, పోక్సో కోర్టు)గా నియమితులయ్యారు. ఈ మేరకు పట్టణంలోని డాక్టర్స్ అసోసియేషన్ భవనంలో శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరై దిలీప్ కులకర్ణిని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన విశాల్ కులకర్ణి జడ్జిగా నియమితులవడం గర్వకారణమన్నారు. డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీజేపీ పట్టణ కమిటీతోపాటు పలువురు కులకర్ణిని సన్మానించారు. డాక్టర్ దామోదర్ రెడ్డి, డాక్టర్ కాశీనాథ్, ఏజీపీ సంతోష్, రమేశ్ మాశెట్టివార్, రమేశ్ మాంధాని, నాగనాథ్ పటేల్, కృష్ణదాస్, ఏనుగు గంగారెడ్డి, రామకృష్ణగౌడ్, రాజారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

డివైడర్లకు మరమ్మతు



సాక్షి స్పందన

జిల్లా కేంద్రంలో డివైడర్లు కూలిపోయాయని, కొన్నిచోట్ల రాళ్లు కిందపడినా ఎవరూ పట్టించుకోకపోవడంపై ఈనెల 11న 'ప్రమాదకరంగా డివైడర్లు' శీర్షికన 'సాక్షి'లో ఫొటో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు ప్రధాన కూడళ్ల వద్ద కూలిపోయి ఉన్న డివైడర్లకు మరమ్మతు చేపట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



క్లుప్తంగా

ఎమ్మెల్యే వాహనం తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి చెక్‌పోస్టు వద్ద శనివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వాహనాన్ని ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఇన్‌చార్జి రవీందర్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. సిబ్బంది నిర్భయంగా విధులు నిర్వహించడంపై వారిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై దేవ్, సిబ్బంది ఉన్నారు.

కరెంట్ షాక్‌తో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

జైనథ్: మండలంలోని దీపాయిగూడ గ్రామానికి చెందిన కాట్పెల్లి వామన్ రెడ్డికి చెందిన ఎద్దు మేతకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. స్థానికులు బాధితుల కథనం మేరకు... వామన్‌రెడ్డి ఎద్దు సాంగ్వి శివారులోని పూంద్రు ప్రవీణ్ చేనులో మేతమేస్తున్నాయి. చేను గట్టు మీద మేతమేస్తుండగా ఓ ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న రైతు సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించాడు. సుమారు రూ.50వేల విలువ చేసే ఎద్దు మృతి చెందడంతో లబోదిబోమన్నాడు. అధికారులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

ఉట్నూర్‌రూరల్: ఒంటరి తనం భరించలేక మనస్తాపానికి గురై డిగ్రీ విద్యార్థి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది.. ఎస్సై మనోహర్ వివరాల ప్రకారం.. మండలంలోని లక్సెట్టిపేట గ్రామానికి చెందిన మేఘశ్యాం కుమారుడు అర్క వినోద్ (23) ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో వారు శుభకార్యానికి వెళ్లి సాయంత్రం వచ్చి చూడగా వినోద్ దూలానికి వేలాడుతూ కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి సోదరుడు గణపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పునరావాసం ఎప్పుడో..?

- ఇప్పటికీ ప్రతిపాదనల్లోనే గుండేగాం పరిస్థితి..
- మరో రెండు నెలల్లో వర్షాకాలం
- ఇంకా ఎదురుచూస్తున్న గ్రామస్తులు



గుండేగాం గ్రామం

భైంసారూరల్: గుండేగాం పునరావాసంపై స్పష్టత రావడం లేదు. ఏళ్ల సమస్యకు ఎక్కడ పరిష్కారం కనిపించడం లేదు. ప్రభుత్వం మారినా గుండేగాం సమస్య మాత్రం తీరడం లేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ గుండేగాం సమస్యపై ఎవరు స్పందించడం లేదు. పాత సర్వేలు, అవే ప్రతిపాదనలు మళ్లీమళ్లీ పంపిస్తున్న ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద నిధులైతే రావడం లేదు. 2009 నుంచి ఇదే పరిస్థితి ఉన్న ఎవరు స్పందించడం లేదు. ఏళ్లుగా పునరావాస సమస్యకు పరిష్కారం చూపడం లేదు. ప్రతియేటా వర్షాకాలం ఆరంభంలో భారీ వర్షాలు కురియగానే గుండేగాం ఊరిలోకి బ్యాక్‌వాటర్ చొచ్చుకుపోవడం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలు గుండేగాంలోకి రావడం పరామర్శించడం, వెళ్లడం ఆనవాయితీగా మారిపోయింది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలతో గ్రామంలోని చాలా కుటుంబాలు పట్టణ సమీపంలోని కమలాపూర్ గుట్ట వద్ద నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలో తాత్కాలిక ఆవాసం ఏర్పరుచుకున్నారు. శాశ్వత పరిష్కారం కోసం అంతా ఎదురుచూస్తున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలతో 81 కుటుంబాలు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లలోనే నివసిస్తున్నాయి.

సర్వేలకే పరిమితం...

పల్సికర్ రంగారావు ప్రాజెక్టు నిర్మాణంతో గుండేగాం గ్రామం నీటమునిగింది. ప్రతియేటా వర్షాకాలంలో గ్రామం ముంపునకు గురవుతుంది. ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఊరుమునగదని తేల్చారు. కానీ ప్రతియేట ప్రాజెక్టు నీటిలో గ్రామం మునిగిపోతుంది. భారీ వర్షాలు కురిసిన సమయంలో వాగు పరివాహక ప్రాంతాల్లో ఉన్న నివాసాల్లో నీరు నిలిచికనిపిస్తుంది. గ్రామంలో 162 కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాలకు సంబంధించిన 364 ఎకరాల పంట భూములు కూడా నీటమునుగుతున్నాయి. వ్యవసాయమే ప్రధాన ఆధారంగా బతుకుతున్న గుండేగాం వాసుల ఇబ్బందులు తీరడంలేదు. ఏళ్లుగా ఈ సమస్యవెంటాడుతున్న పరిష్కారం దొరకడంలేదు.



వర్షాలకు గ్రామంలోకి చొచ్చుకువచ్చిన నీరు (ఫైల్)

కొత్త ప్రభుత్వంపై ఆశలు...

గుండేగాం వాసులు పునరావాసం కోసం కొత్త ప్రభుత్వంపైనే ఆశలు పెంచుకున్నారు. కొత్త ప్రభుత్వంలో తమ ఇబ్బందులు తీరుతాయని అంతా భావిస్తున్నారు. గుండేగాం గ్రామానికి పునరావాసం కల్పిస్తే శాశ్వత పరిష్కారం దొరకనుంది. పదేళ్లుగా గుండేగాం గ్రామస్తులు ఈ సమస్య పరిష్కారం కోసం రాష్ట్రంలో అప్పటి నాయకులను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఎన్నోఏళ్లుగా సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతూనే ఉన్నారు.

అధికారులను కలిశాం



గుండేగాం పునరావాసం కోసం అప్పట్లో కలెక్టర్, రాష్ట్ర మంత్రులను కలిశాం. అప్పట్లో గ్రామంలో చొచ్చుకొచ్చిన నీటి ఫొటోలను అధికారులకు పంపించాం. పునరావాసంపై వినతిపత్రాలు సమర్పించాం.

– అశోక్, గుండేగాం

ప్రతి పాదనలు పంపించాం

గుండేగాంలో ముంపునకు గురయ్యే ఇళ్లను గుర్తించాం. గతంలో గుండేగాం గ్రామంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సర్వేలు జరిగాయి. అక్కడ ఎదురవుతున్న సమస్యలన్నింటిని సర్వే బృందం ఉన్నతాధికారులకు నివేదించింది. గుండేగాం సమస్య పరిష్కారం కోసం అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో కృషి చేయనుంది.

– ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్

ప్రభుత్వ అధికారులు గుండేగాంపై దృష్టిసారిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకనుంది.

పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణ కల్పించాలి

ఎదులాపురం: జిల్లాలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణ కొరవడిందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరీశ్, గణేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీం భవనంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఓ విద్యార్థిని పాము కాటుకు గురైందని, ఇటీవల ఉట్నూర్ మండలంలోని ఉట్నూర్ ఆశ్రమ పాఠశాలలో 3వ తరగతి విద్యార్థి టీకం మాణిక్‌రావు విద్యుత్ షాక్‌కు గురయ్యాడని, అదే మండలం లక్సెట్టిపేట్ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి కొడప తుకారాం కాలు ప్యాక్చరైందన్నారు. ఈ ఘటనల్లో ఎలాంటి ప్రాణాపాయం సంభవించలేదన్నారు. చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా సంఘటనలపై దృష్టి సారించి సంబంధిత పాఠశాలల బాధ్యులపై ఇప్పటికైనా జిల్లా విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దత్తత్రి, జిల్లా కోశాధికారి నాగేందర్, జిల్లా కమిటీ సభ్యులు పూజ ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్

రిమ్స్‌లో వైద్యుల నిర్లక్ష్యం

- గంటల తరబడి రోగి పడిగాపులు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్ని విమర్శలు ఎదుర్కొంటున్న రిమ్స్ వైద్యుల తీరు మాత్రం మారడం లేదు. బేల మండలంలోని ఏటి గ్రామానికి చెందిన కోయిరే నత్తు తన రెండు కాళ్లు పక్షవాతంతో పనిచేయకపోవడంతో కుటుంబీకులు రిమ్స్ ఆసుపత్రికి ఉదయం 10 గంటలకు తీసుకువచ్చారు. అంబులెన్స్ సిబ్బంది అత్యవసర విభాగం వద్ద స్ట్రెచర్‌లో దించి వెళ్లారు. ఎమర్జెన్సీ వార్డులోని సిబ్బంది పాత భవనంలోకి తీసుకెళ్లాలని కుటుంబీకులకు సూచించారు. దీంతో రోగిని అక్కడికి తీసుకెళ్లగా ఇక్కడ కాదని అక్కడికే వెళ్లాలని తిప్పి పంపించారు. ఆ తర్వాత రిమ్స్‌లోని సిబ్బందికి చెప్పినా ఎవరు పట్టించుకోకుండా గంటల తరబడి తిప్పించారని బాధిత కుటుంబీకులు వాపోయారు. చివరకు రాత్రి ఏడు గంటల ప్రాంతంలో బేల యువజన కాంగ్రెస్ నాయకుడు సామ రూపేష్‌రెడ్డి రిమ్స్ డైరెక్టర్‌ను సంప్రదించడంతో డైరెక్టర్ ఆదేశాల మేరకు సిబ్బంది బాధితుడిని ఆసుపత్రిలో చేర్చుకున్నారు. గంటల తరబడి స్ట్రెచర్‌లోనే పడుకున్నప్పటికీ వైద్యం అందకపోవడంతో కుటుంబీకులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.



స్ట్రెచర్‌పై పడుకుని ఉన్న రోగి

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



భోజన్న మృతదేహం

నర్సాపూర్ (జి): మండలంలోని అర్లి(కె) ఎక్స్‌రోడ్డు వద్ద గుర్తు తెలియని ట్రాక్టర్ ట్రాలీని ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం... లోకేశ్వరం మండలం బాగాపూర్ గ్రామానికి చెందిన మాదరి భోజన్న(50) ద్విచక్ర వాహనంపై శుక్రవారం పని నిమిత్తం రాంపూర్ గ్రామానికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామం బాగాపూర్ వెళ్తుండగా రాత్రి అర్లి(కే) ఎక్స్‌రోడ్డు సమీపంలో ముందు వెళ్తున్న గుర్తు తెలియని ట్రాక్టర్ డ్రైవర్ బ్రేక్ వేయడంతో వెనుక ట్రాలీకి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో భోజన్న తలకు బలమైన గాయమైంది. స్థానికులు అంబులెన్స్‌లో భైంసాలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. శనివారం అతడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

ఆదివాసీ నేతలను కలిసిన సక్కు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని పలువురు ఆదివాసీ సంఘాల నాయకులను బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు శనివారం రాత్రి ఆదిలాబాద్‌లో కలిశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. తనను పార్లమెంట్‌కు పంపేందుకు మీ వంతుగా సహకారం అందిస్తే ఆదివాసుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న పలువురు ఆదివాసుల ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసేవారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.



విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న సక్కు

పండ్ల తోటల వేలం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని ఉద్యాన నర్సరీలోని పండ్ల తోటల వేలం వేయనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి ఖుష్బూ గుప్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్ ఐటీడీఏ ఉద్యాన నర్సరీలో ఉన్న మామిడి, జామ తోటల ఫల సాయాన్ని ఏప్రిల్ 6వ తేదీన తోటలోనే వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యాపారులు మధ్యాహ్నం 3గంటలకు ఉట్నూర్ నర్సరీలో జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాలకు ప్రాజెక్టు హర్టికల్చర్ అధికారి, ఐటీడీఏ ఉద్యాన అధికారి సుధీర్‌కుమార్ 9032313933 సంప్రదించాలని కోరారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



భీంరావు(ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన గజ్జెన భీంరావు (34) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఏపనీ చేయకుండా ఇంటివద్ద ఖాళీగానే ఉంటున్నాడు. దీంతో ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండేవి. జీవితంపై విరక్తి చెందిన భీంరావు శనివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మట్కాపై ఉక్కు పాదం మోపుతాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

- తీరు మారకుంటే పీడీ యాక్ట్ నమోదు
- జిల్లా ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో మట్కా నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అత్యాశకు పోయి డబ్బులను పోగొట్టుకోవద్దని యువతకు, ప్రజలకు సూచించారు. ఆదిలాబాద్ జిల్లా మహారాష్ట్రకు ఆనుకొని ఉన్నందున జిల్లా సరిహద్దు అవతల వైపు ఉన్న నిందితులు జిల్లాలో తరచూ మట్కా నిర్వహించే ప్రయత్నం చేస్తున్నారని యువత, జిల్లా ప్రజలు మట్కాపై ఆకర్షితులు కాకుండా అడ్డుకోవడంలో జిల్లా పోలీసు వ్యవస్థ ముందుందని తెలిపారు. మట్కా నిర్వహిస్తున్న నిందితులను బైండోవర్ చేస్తూ అడ్డుకట్ట వేస్తున్నట్లు వివరించారు. మట్కా నిర్వాహకులపై పీడీ యాక్ట్ సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల దినచర్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గత ఏడాది 43 కేసులు నమోదు కాగా 116 మందిని అరెస్టు చేసి, రూ.6,54,660 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ ఏడాది 12 కేసుల్లో 41 మందిని అరెస్టు చేసి, దాదాపు రూ.లక్ష వరకు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తొమ్మిది మంది అరెస్ట్..

రూ.32,50 స్వాధీనం..

మట్కాను సమూలంగా నిర్మూలించేందుకు నడుం బిగించామని ఎస్పీ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా శనివారం జైనథ్, భీంపూర్ మండలాల్లో మట్కా స్థావరాలపై దాడులు నిర్వహించి రూ.32,750 నగదు, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకుని, 9 మందిని అరెస్టు చేయగా, ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అలాగే జైనథ్ మండలంలో మట్కా స్థావరంపై దాడి చేసి సత్యనారాయణ (తలమడుగు), కిషన్ (తలమడుగు), సయ్యద్ రజి యుద్దీన్ (ఆదిలాబాద్)లను పట్టుకున్నామన్నారు. మరో నిర్వాహకుడు అశోక్ సామ్రాట్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేసి వారి నుంచి మట్కా చిట్టీలు, రూ.11,050 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా భీంపూర్ మండలంలో మట్కా స్థావరంపై దాడిచేసి మట్కా నిర్వాహకులు శ్యామ్‌రావు, మడావి దత్తు, రవీందర్, తొడసం బండు, షేక్ సాజిద్, ఆశిష్‌లను పట్టుకున్నామని, సంజీవ్ జైస్వాల్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఏడుగురిపై భీంపూర్ పీఎస్‌లో కేసు నమోదు చేశామని, వారి నుంచి మట్కా చిట్టీలు, రూ 21,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, జైనథ్ సీఐ డి.సాయినాథ్, ఎస్సైలు ప్రదీప్‌కుమార్, వి.పురుషోత్తం ఉన్నారు.



స్వాధీనం చేసుకున్న మట్కా చిట్టీలు, నగదు

‘ఆదరించండి.. అభివృద్ధి చేస్తా’

భైంసాటౌన్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తనను గెలిపించాలని, అందరి సలహాలు, సూచనలతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్‌ను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వం తనపై నమ్మకంతో అభ్యర్థిగా ప్రకటించిందని, ఎన్నికల్లో తన గెలుపు కోసం అందరి సహకారం కావాలన్నారు. మహిళనైన తనను ప్రతీ ఒక్కరు ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపాలని, తద్వారా ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకకు అవకాశమివ్వాలని కోరారు. రాజ్యాంగబద్ధమైన విలువలకు కట్టుబడే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్ చంద్రే, ఓం ప్రకాశ్ లడ్డా, రాజన్న, రాంచందర్‌రెడ్డి, కార్యకర్తలున్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

నేరడిగొండ: ఆదిలాబాద్ ఎంపీగా ఒక్కసారి అవకాశం కల్పించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ కోరారు. శనివారం మండల కేంద్రంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ నివాసంలో పార్టీ నాయకులను కలిశారు. ఆడపడుచును ఆదరించాలని కోరారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆడె వసంత్‌రావు ఆధ్వర్యంలో ఆమెను పార్టీ నాయకులు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో బోథ్ ఏఎంసీ అధ్యక్షుడు గంగారెడ్డి, జిల్లా నాయకులు అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, ఏలేటి రాజశేఖర్ రెడ్డి ఉన్నారు.

సావిత్రి గుండెకు రంధ్రం

- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



వన్నెల సావిత్రి

కుంటాల: నిరుపేద కుటుంబానికి చెందిన సావిత్రి.. భర్తకు చెదోడువాదోడుగా ఉంటూ కూలీ పనులకు వెళ్తూ కుటుంబ పోషణలో పాలుపంచుకుంటుంది. అలాంటి ఆ ఇంటి ఆడపడుచుకే పెద్ద కష్టం వచ్చింది. కుంటాలకు చెందిన వన్నెల సావిత్రి-ముత్యం దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలున్నారు. ఇటీవల పెద్ద కూతురు వివాహం చేశారు. ఇదే తరుణంలో సావిత్రి అనారోగ్యానికి గురైంది. నిజామాబాద్‌లో వైద్య పరీక్షలు నిర్వహించగా గుండెకు రంధ్రం ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఇందు కోసం రూ.లక్ష ఖర్చు అవుతుందని స్పష్టం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు డబ్బులు లేక దాతల కోసం ఎదురుచూస్తున్నారు. ఎవరైనా దాతలు స్పందించాలని వేడుకుంటున్నారు. మాజీ ఎంపీపీ జీవి రమణారావు, సృజన విద్యానిలయం ప్రిన్సిపాల్ కొత్తకాపు గంగన్న రూ.5వేల చొప్పున సాయం అందజేశారు. దాతలు 70957 35988 నంబర్‌కు గూగుల్, ఫోన్ పే చేయాలని కోరుతున్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

- ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

తాంసి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్త కృషి చేయాలని పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు కోరారు. శనివారం భీంపూర్ మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పర్యటించారు. నిపాని, భీంపూర్, అంతర్గాం గ్రామాల్లో నాయకులతో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. భారీ మెజార్టీ లక్ష్యంగా ఇంటింటా ప్రచారం చేపట్టాలని సూచించారు. వారి వెంట జెడ్పీటీసీ సుధాకర్, నాయకులు రాజన్న, ముకుంద్ సంతోష్, కపిల్, రాంరెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

రూ. 3,77,500 నగదు స్వాధీనం

జైనథ్: బేల నుండి జైనథ్ వైపు బైక్ పై వెళ్తున్న షేక్ అస్లం అనే వ్యక్తి నుంచి రూ.3,77,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం అధికారులు శ్రీనివాస్, శేషారావ్‌లు తెలిపారు. శనివారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో జాతీయ రహదారిపై జైనథ్‌కు కూతవేటు దూరంలో బైక్ ఆపి తనిఖీ చేయగా ఎలాంటి రసీదు లేకుండా తరలిస్తున్న నగదు లభించినట్టు తెలిపారు. దీంతో పంచనామా నిర్వహించి నగదు స్వాధీనం చేసుకొని అస్లంపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.



పంచనామా నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ టీం

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఆసిఫాబాద్‌అర్బన్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిర్రకుంటకు చెందిన దొడ్డికార్ హీరాచంద్ (75) పట్టణంలో శనివారం జరిగే వారసంతలో సరుకులు కొనేందుకు కలెక్టరేట్ రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా దహెగాం మండలంలోని లగ్గం గ్రామానికి చెందిన కుమ్మరి శివ ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొట్టాడు.

తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు రెఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని సోదరుడు గులాబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.